ప్రజాశక్తి

ఆదివారం 28 జూలై 2024

5

అల్లూరి సీతారామరాజు



వైద్యులను నియమించాలి

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, ఎనస్తీషియన్ వైద్యులను నియమించాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. శనివారం ఆమె కోఆప్షన్ మెంబర్ షేక్ నాజర్ వల్లితో కలిసి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. సిబ్బంది కొరతతో సుదూర ప్రాంతాల నుంచి అనారోగ్య సమస్యలతో వస్తున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. అపిడమిక్ సీజన్‌తో అనేక మంది మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి ప్రమాదకర జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రిలో నెల కొన్న సమస్యలపై ఆసు పత్రి సూపరిం టెండెంట్ చంద్రశేఖర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయ కులు ముత్తా శ్రీను, లోవరాజు లు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న సర్పంచ్

మళ్లీ పెరిగిన గోదావరి

- మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- అదే దారిలో శబరి
- ఆందోళనలో ముంపు గ్రామాల ప్రజలు
- నిలిచిన అంతరాష్ట్రాల రాకపోకలు


విఆర్.పురం మండలం రేఖపల్లిలో గుడారాల్లో ఉన్న ముంపు బాధితులు

ప్రజాశక్తి-చింతూరు

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి మళ్లీ పెరిగింది. శనివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 52.9 అడుగులకు చేరడంతో మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం వరద ఉధృతి తక్కువగా ఉండడంతో 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోగా, మరో రెండు గంటల్లోనే ఎగువ నుండి వరద వచ్చి చేరడంతో మళ్లీ రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. శుక్రవారం సాయంత్రం 47 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం, మరికొద్ది సమయంలోనే 49 అడుగులకు చేరింది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 52.9 అడుగులకు చేరడంతో మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మరో వైపు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి ప్రధాన డ్యామ్ నుండి 10,936 క్యూసెక్కుల నీటిని నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారు. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం శనివారం సాయంత్రానికి 40 అడుగులకు చేరువలో ఉంది. గత 15 రోజులుగా వరదలు, వర్షాల కారణంగా వాగులు పొంగడం, రోడ్లు కోతకు గురికావడంతో మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు వచ్చేందుకు వీలు లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చింతూరులోనే స్థానికంగా ఉంటూ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ బోట్ల ద్వారా లోతట్టు ప్రాంతాలకు నిత్యావసరాలు, కూరగాయలు, మందులు టార్పలిట్లు అందజేస్తున్నారు.


చింతూరు బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న శబరి నది

ఎటపాక : వారం రోజులుగా వరద ఉధృతితో ముంపు గ్రామాల ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్న గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద మరికొంత పెరగవచ్చని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు. ముంపునకు గురయ్యే ఆవాసాల నుండి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సిబ్బందికి అధికారులు దిశా నిర్దేశం చేశారు. శనివారం ఉదయం నుండి జాతీయ రహదారిపై పలుచోట్ల వరద నీరు చేరడంతో భద్రాచలం నుండి చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాయనపేట, నెల్లిపాక, నందిగామ, మురుమూరు, చెన్నంపేట వద్ద రహదరులపై నీరు చేరుకుంది. చెన్నంపేట రహదారిపై నీరు చేరుకోవడంతో ఎటపాక నుండి చర్ల వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ, మురుమూరు గ్రామాలలో ప్రభుత్వ అధికారులు నిత్యవసరాలు పప్పు, ఉప్పు, ఆయిల్, బంగాళదుంపలు, ఉల్లిపాయలు పంపిణీ చేశారు. కాగా పెళ్లైన జంటలకు నిత్యావసరాలు అందించకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో వారికి కూడా పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

విఆర్.పురం : ఇప్పటికే వడ్డిగూడెం, శ్రీరాంగిరి వంటి పంచాయతీల్లో గ్రామాలు వరదలో ఉండగా, గోదావరి, శబరి మళ్లీ వరద పెరగడంతో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. విఆర్.పురం మండలం వడ్డుగూడెం గ్రామం వద్ద గోదావరి, శబరి నదులు కలుస్తాయి. వీట్లో వరద నీరు పెరగడంతో విఆర్.పురం, రాజపేట, మొద్దులగూడెం, అన్నవరం గ్రామాలు మునిగే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ గ్రామాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వారికి బరకాలు, కిరోసిన్, బియ్యం, నిత్యవసర సరుకులు, దోమ తెరలు అందించాలని కోరుతున్నారు. రేఖపల్లిలో గుడారాలు వేసుకొని పది రోజులుగా జీవిస్తున్న వరద బాధితులకు అధికారులు వసతులు కల్పించట్లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూనవరం : గోదావరి వస్తూ పోతూ ముంపు ప్రాంత ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తుంది. శనివారం వరద ఉధృతి పెరగడంతో అధికారులు కూనవరం, టేకులబోరు మధ్య మళ్ళీ బోట్‌ని ఏర్పాటు చేసారు. స్థానిక ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వరద తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు. కొన్ని గ్రామాలు కరెంటు లేక చీకట్లో పిల్లలు, వృద్ధులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కూనవరం, టేకులబోరు, కొండ్రాజు పేట, శబరి కొత్తగూడెం, టేకుబాక గ్రామాలు ముంపునకు గురి అయ్యాయి. ఇంకా ముంపు తీవ్రం అయితే మరిన్ని గ్రామాలు ముంపు బారిన పడే అవకాశాలు ఉన్నాయి.


చింతూరు మండలం చట్టి వద్ద జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు


ఎటపాక మండలంలోని రాయనపేట వద్ద జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు

ముంపు బాధితుల బాధలు వర్ణనాతీతం

ప్రజాశక్తి-చింతూరు

గత 15 రోజులుగా వర్షాలు దంచి కొడుతున్న నేపథ్యంలో చింతూరు డివిజన్ ఏజెన్సీ ప్రాంతాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలు జనజీవనాన్ని కుందేలు చేశాయి. రోజువారి కూలి పనులు లేక రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు వరదలకు ఛిద్రమవుతున్నాయి. ప్రతి సంవత్సరం వరదలు ముంచెత్తి చిన్న సన్న కారు రైతులకు శాపంగా మారుతున్నాయి. ప్రధానంగా కాపర్ డ్యాం కారణంగా బ్యాక్ వాటర్ ప్రభావంతో నాలుగు మండలాలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. పరిహారం ఇప్పించండి, పోలవరం బ్యాక్ వాటర్ నుండి మమ్మల్ని కాపాడండి అంటూ అధికారుల ముందు నిర్వాసిత ప్రజానీకం మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పార్టీలు మారుతున్నాయి తప్ప నిర్వాసితుల జీవితంలో మాత్రం మార్పు ఉండడం లేదు. పరిహారం వచ్చి, పునరావసం కల్పిస్తే వెళ్లిపోతామంటున్న నిర్వాసితులకు ప్రతి ఏటా నిరాసే మిగులుతుంది. ఒకపక్క వర్షాలు మరోపక్క భారీ వరదలు తమ నివాసాలను, పంట పొలాలను ముంచెత్తుతూ తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కూటమి ప్రభుత్వమైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నాలుగు మండలాల ముంపు ప్రజానీకం ముక్తకంఠంతో కోరుతున్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలో వరదలకు పది రోజులుగా రహదారులు బంద్ కావడంతో ఆ గ్రామస్తులకు స్థానిక సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, విఆర్ఓ దూలయ్య చేతుల మీదుగా శనివారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నదులు ఉప్పొంగటంతో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని, కొన్ని గ్రామాలు నీట మునగటంతో రేఖపల్లిలో గుడారాలు వేసుకొని ఉంటున్నారని తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకూడదని ఉద్దేశంతో అధికారులతో మాట్లాడి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సీజన్లో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, పాల్గొన్నారు.

ములకలపల్లిలో...

విఆర్.పురం మండలంలోని ములకలపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ సర్పంచ్ సవలం మారయ్య, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, పంచాయతీ సెక్రెటరీ చేతుల మీదుగా ప్రజలకు నిత్యావసర సరుకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఆర్ఎ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగరాజు, గ్రామ పెద్దలు మడకం కృష్ణ, మడకం దినేష్, కారం గోపాల్, కారం సుమన్, సోయం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ విఫలం

శబరి, గోదావరి వరద బాధితులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం విఫలమైందని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్ట రామారావు ఆరోపించారు. మండలంలోని చిన్నమట్టపల్లి, రామవరం పంచాయతీల్లో వైసిపి నాయకులు శనివారం పర్యటించి వరద బాధితులతో మాట్లాడారు. చింత రేవుపల్లిలో వరద బాధితులు తమ బాధలను, గోడును చెప్పుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెల నెల ఇచ్చే రేషన్ బియ్యం ఇచ్చారు తప్ప వరద బియ్యం ఇవ్వలేదని తెలిపారు. ఇళ్లలోకి 10 అడుగుల లోతు వరకు నీరు వచ్చిందని, గుట్టల్లో తలదాచుకున్న తమకు అరకొరగానే నిత్యావసర సరుకులు ఇచ్చారని పేర్కొన్నారు. వైసిపి నాయకులు చిక్కాల బాలు, బొడ్డు సత్యనారాయణ, కోటం జయరాజు, చీమల కాంతారావు, మాచర్ల వెంగలరావు, రేవు బాలరాజు, గూటల నవీన్, గూటల ముత్యాలరావు, మిల్లు దుర్గారావు పాల్గొన్నారు.



రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెంలో ముంపు బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న సర్పంచ్ పూనం సరోజిని, సిపిఎం నేత సత్యనారాయణ తదితరులు



పనులను పర్యవేక్షిస్తున్న పిఒ అభిషేక్

ఏజెన్సీలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివద్ధి సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల పరిధిలో పారిశుధ్య పక్షోత్సవాలు ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 25 వ తేదీ నుండి ఆగష్టు 10 వ తేదీ వరకూ గ్రామ పంచాయతీలలో ఒకొక్క రోజు ఒకొక్క కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మొదటి రెండు రోజులు పిచ్చి మొక్కలు తొలగింపు, డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. మూడవ రోజైన శనివారం పంచాయితీలలో మురుగు నీరు నిల్వ వున్న ప్రదేశాలను గుర్తించి, నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేశారు. పాడేరు డివిజన్ కేంద్రములో నిర్వహించిన ఈ కార్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ పాల్గొని కాలువల్లో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా, డయేరియా,టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధుల నివారణకు పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, మలేరియా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్ మాట్లాడుతూ, డివిజన్ వ్యాప్తంగా 11 మండలాలలో ఎంపిడిఓలు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు రోజువారీ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని మండలాల్లో క్లోరినేషన్, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్యంపై ర్యాలీ

అరకులోయ రూరల్: అరకులోయ పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, ఎంపీడీవో సిహెచ్ వెంకటేష్, పంచాయతీ ఈవో రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్డు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని ఎంపీడీవో సూచించారు. వచ్చే నెల 10వ తేదీ వరకు 15 రోజులు నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, డయేరియాపై ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమరాజు, వార్డు సభ్యులు త్రినాథ్, పాడి చందు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న అధికారులు

చింతపల్లి: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలలోని మురుగునీరు, చెత్తా చెదారం నిల్వ ఉన్న ప్రాంతాలలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు పెదబరడ పంచాయతీ సెక్రెటరీ కే పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోతుగడ్డ జంక్షన్‌లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమలు వృద్ధి చెందకుండా, లార్వా దశలోనే అవి అంతమయ్యే విధంగా ఆయిల్ బాళ్లను తయారు చేసి నిల్వ ఉన్న నీటిలో వేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా జెడ్‌పి సమావేశం

- -భూ కబ్జాలపై టిడిపి, వైసిపి సభ్యులు పరస్పర ఆరోపణలు
- -యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు లేవనెత్తిన అంశంతో రగడ
- -'సూపర్ సిక్స్ ' అమలు ఎప్పుడంటూ వైసిపి సభ్యులు పట్టు
- -వ్యవసాయం, ఆరోగ్య అంశాలపై చర్చ
- -గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జెడ్‌పిటిసి డిమాండ్


జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర, యలమంచిలి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు మినహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఎమ్మెల్యేలు ఎన్నిక కావడంతో వారందరికీ జిల్లా పరిషత్‌లో స్థాయీ సంఘ సభ్యులుగా అవకాశం వచ్చింది. దీంతో శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన పరిషత్ అసెంబ్లీ హాల్‌లో జరిగిన సమావేశంలో వ్యవసాయం, ఆరోగ్య అంశాలపై ముందుగా చర్చించారు. చర్చలు ప్రారంభమైన వెంటనే అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి డి.గంగరాజు, కొయ్యూరు జెడ్‌పిటిసి నూకరాజు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వ్యవసాయ శాఖ పనితీరు బాగులేదని, రైతులకు సరఫరా చేసిన వరి విత్తనాలు మొలకెత్తకుండా పోయాయని, గిరి రైతులు తీవ్రంగా నష్టపోయారని సభ దృష్టికి తెచ్చారు. పంట నష్టం వాటిల్లిన జీడికి పరిహారం అందలేదన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా ఇప్పటికీ రాజ్మా, రాగుల విత్తనాల సరఫరా జరగలేదని గంగరాజు ప్రస్తావించారు. అనకాపల్లి జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా అమ్మకాలు చేసిన వరి విత్తనాలు మొలకెత్తలేదని కొంతమంది సభ్యులు చెప్పారు. అలాంటి 40 బస్తాలను వెనక్కి పంపామని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బదులిచ్చారు.

రైతు భరోసా ఎప్పుడు ?

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటికీ రైతులకు రైతు భరోసా సొమ్ము ఈనాటికీ జమ చేయలేదని, ఇంకా ఎప్పుడు జమ చేస్తారని కొందరు జెడ్‌పిటిసి ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదని విశాఖ జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి చెప్పారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఫ్యాక్టరీ మూతపడదని, రైతులకు మేలు జరుగుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మాట్లాడుతూ గతంలో గంధవరంలో ఏర్పాటు చేయతలపెట్టిన విత్తన పరిశోధన కేంద్రం నిలిచిపోయిందని, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల వరదలకు నష్టపోయిన పంటలకు పరిహారాన్ని తక్షణమే ఇవ్వాలని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కోరారు. వరద నష్టాలపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారు ? ఎంత నష్టం వాటిల్లింది ? ఈ - క్రాప్ ఎంతమేర జరిగింది ? వంటి అంశాలను వివరించాలన్నారు.

అంశాలవారీగా విభజించి సమావేశాలు పెట్టండి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ అజెండాలో అన్ని అంశాలపై ఒకేరోజు చర్చ కాకుండా అంశాలను విభజించి సమావేశాలు నిర్వహించడం మంచిదని, ఇందువల్ల చర్చ బాగా సాగుతుందని, సమయం కలిసి వస్తుందని తెలిపారు. అజెండాలో అన్ని అంశాలూ కాకుండా 3, 4 అంశాలతోనే సమావేశం ముగుస్తోందని, దీనివల్ల ప్రయోజనం లేకుండా పోతోందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒకటి, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు కలిపి ఒకటి సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని సూచించారు. దీనిపై జెడ్‌పి సిఇఒ పోలినాయుడు స్పందిస్తూ అలా నిర్వహించడం సాంకేతికంగా సాధ్యం కాదని, కోరం సమస్య తలెత్తుతుందని, అయినప్పటికీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని సమాధానం చెప్పారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జెడ్‌పి స్కూళ్లలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ వైద్యాలయంలో కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన స్కానింగ్ యంత్రం మూలన పడిందని, రేడియేటర్ లేని కారణంగా అది పనిచేయడం లేదని తెలిపారు.


సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

అంశాలవారీగా చర్చ సాగుతున్న సమయంలో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో కొండకర్ల జిల్లా పరిషత్తు హైస్కూల్ స్థలం కబ్జాకు గురికాగా తాము పోరాడి అడ్డుకున్నామని చెప్పారు. ఇటువంటి దురాగతాలు గత ప్రభుత్వంలో మరికొన్ని జరిగాయని వాటిని కూడా వెలికి తీస్తామని చెప్పారు. కొండకర్ల ప్రాంతానికి చెందిన జెడ్‌పిటిసి కో - ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యలమంచిలి ఎమ్మెల్యే పేరు చెప్పుకొని తమ ప్రాంతంలో కొందరు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనికి ఎమ్మెల్యే విజయ కుమార్ తీవ్రస్థాయిలో స్పందించి ఆయనపై ఆగ్రహం వ్యక్తపరిచారు. తప్పుడు ఆరోపణలు చేయవద్దని, అటువంటి వాటిని సాగనిచ్చేది లేదని చెప్పారు. తాను నిరూపిస్తానని జెడ్‌పిటిసి కుమార్ చెప్పడంతో గొడవ జరిగింది. ఎమ్మెల్యే విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ గత ప్రభుత్వంలో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం జరిగాయని, వాటిలో అధికార పార్టీ వారే ఎక్కువ మంది ఉన్నారని చెప్పడంతో వైసిపికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు మూకుమ్మడిగా ఎమ్మెల్యే కూర్చున్న స్థానానికి వచ్చి ఆయనతో వాగ్వాదానికి దిగారు. బుచ్చయ్యపేట జెడ్‌పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ జెడ్‌పి సమావేశంలో రాజకీయాలు మాట్లాడటం సరికాదని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే అందరం చర్చించి పరిష్కారం చూపుదామని అన్నారు. ఆయనపైనా విజయకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో సమావేశం మరింత ఉద్రిక్తంగా మారింది. సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని ఎందుకు అమలు చేయటం లేదని, ఆ పథకాలు ఎప్పుడు అందుతాయని జెడ్‌పి వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు ప్రశ్నించారు.

విజయకుమార్ వ్యాఖ్యలు సరైనవి కావు : జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర వేదిక నుంచి కిందకు వచ్చి ఎమ్మెల్యే విజయకుమార్ వ్యాఖ్యలు సరైనవి కాదని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెకు వైసిపి జెడ్‌పిటిసిలు మద్దతు తెలిపారు. వారంతా ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌పైకి దూసుకు వెళ్లారు. వైసిపి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కేంద్రంతో పాటు రైతు భరోసా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసేదని, కూటమి ప్రభుత్వం ఇప్పటిదాకా జమ చేయలేదని, ఇది వాస్తవం కాదా ? అని నిలదీశారు. దీంతో సుమారు గంటసేపు సమావేశంలో రచ్చ సాగింది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జోక్యం చేసుకొని ఇరుగ్రూపులకూ సర్ది చెప్పడంతో రగడ సద్దుమణిగింది. తదుపరి అంశాలను చర్చించడం కోసం సమావేశాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేసి కొనసాగించారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన రావికమతం జెడ్‌పిటిసి తలారి రమణమ్మకు నివాళ్లర్పించారు. సమావేశంలో అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగ మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై గళం విప్పిన సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులు తీవ్రంగా ప్రబలి గిరిజనులు రోగాల బారిన పడుతున్నారని, వారికి సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు దీనిపై తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతగిరి మండలం వెంకయ్య పాలెం ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయుడును నియమించాలని డిమాండ్ చేయగా సదరు అధికారి స్పందిస్తూ సోమవారం నుంచి ఉపాధ్యాయుడు వస్తారని సమాధానమిచ్చారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ గుమ్మకోట ఎపిఆర్ గురుకుల పాఠశాలలో పదో తరగతిలో 542 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియట్‌కు ఎపిఆర్‌లో జాయినింగ్‌కు వెళ్లిన విద్యార్థికి ఇంగ్లీష్ చదవడం రాకపోవడం బాధాకరమని తెలిపారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ పిల్లల పట్ల, పిల్లల విద్య, బోధన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని కోరారు. బొర్రా కేవ్స్‌కు ఆనుకొని అక్రమంగా నిర్మించిన జిప్ లైన్‌ను ఐటిడిఎ లేదా పంచాయతీ స్వాధీనం చేసుకోవాలన్నారు. .జిప్ లైన్ నుంచి వసూలు చేసిన రూ.2 కోట్లా 51 లక్షలను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. 1/70ని, పీసా చట్టాన్ని ఉల్లంఘించి నిర్మాణాలు సాగించిన గిరిజనేతర కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బొర్రా కేవ్స్ నుంచి పంచాయతీకి రావాల్సిన రాయల్టీ సుమారు రూ.6 కోట్లను చెల్లించాలని, అరకు పంచాయితీకి రావాల్సిన రూ.2 కోట్లును చెల్లించాలని డిమాండ్ చేశారు.

మురుగు కాలువల సమస్యపై వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి: మన్యంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి 516ఇ గ్రామాలలో రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం తక్షణమే చేపట్టాలని చిన్నగడ్డ గ్రామస్తులు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు కొండల నుంచి నీరు గ్రామాలలోకి వస్తుండటంతో తమ ఇళ్లన్నీ మురికి నీటితో నిండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ మండల జనసేన ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తహసిల్దార్ రామకృష్ణకు లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ రహదారిని గ్రామానికి ఎత్తులో నిర్మించారని, ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వర్షపు నీరు, కొండలపై నుంచి వచ్చే వరద నీరు నేరుగా గ్రామాలలో ఇళ్లలోకి ప్రవహిస్తుందన్నారు.అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి తహశీల్దార్ హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చిన్న, బాబీ, చిన్నగెడ్డ గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడితే కఠిన శిక్షలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి-హుకుంపేట : మెట్టుజోరు పంచాయతి కుంతర్ల గ్రామంలో శనివారం సిఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ బి.సతీష్‌లు గంజాయి సాగు, రవాణాతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ ఎస్ సన్యాసినాయుడు మాట్లాడుతూ, డబ్బులకు ఆశపడి గిరిజన యువత అక్రమ మార్గములో గంజాయిని తరలించి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. గంజాయి పంటను పండించడం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. నాటు సారా తయారీ, రవాణా, అమ్మకం చేపడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. గంజాయి పంట మానేసి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించి ఆదాయం పొందాలనాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతం దూర విద్య కోర్సులలో అడ్మిషన్లు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఇఇ)ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, ఎంబిఎ, బిఎ, బికాం డిగ్రీ కోర్సులలో 2024 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. దూర విద్యావిధానంలో ఈ కోర్సులను అభ్యసించవచ్చని, పూర్తి సమాచారం, ఆన్‌లైన్ దరఖాస్తులకు గీతం వెబ్‌సైట్ www.gitam.eduను పరిశీలించాలని సూచించారు.. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగష్టు 31 తేదీలోగా అందజేయాలన్నారు.

పేద నివాసితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి- పెందుర్తి : భూపోరాటంలో భాగంగా ఇళ్లను కట్టుకున్న పేదలకు ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్ సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి కోరారు. శనివారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కలిసి విన్నవించారు. పేదలు ఆక్రమించిన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇవ్వడమో, లేకుంటే, ప్రత్యామ్నాయంగా వేరొక స్థలం చూపించాలని, లేకుంటే వారికి టిడ్కో ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వాలని కోరారు. దీనిపై పంచకర్ల స్పందిస్తూ, నిజమైన అర్హులకు తప్పక న్యాయం చేస్తామన్నారు. భూకబ్జాలు, ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, స్థానిక సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, తానూ కలెక్టర్‌తో మాట్లాడతానని భరోసానిచ్చారు.

భూకబ్జాలపై ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తాం

భూకబ్జాలపై వారంలో ఏదోఒక రోజున ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాట చేయనున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రకటించారు భూకబ్జాలపై పత్రికలు, సోషల్‌మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో శనివారం జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్‌లోని ప్రైవేట్ కల్యాణ మండపంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్ల గత ప్రభుత్వ పాలనలో ఇష్టారాజ్యంగా భూకబ్జాలు జరిగాయని, వాటిపై చర్యలు ఉంటాయన్నారు. తన దృష్టికి వచ్చిన భూకబ్జాలపై వారంరోజుల్లోగా తగు చర్యలు తీసుకుంటానన్నారు. పంచగ్రామాల భూసమస్య కమిటీ పరిధిలో ఉందని, ఇది అతిత్వరలో కొలిక్కి రానుందన్నారు.


ఎమ్మెల్యే పంచకర్లతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

హెపటైటిస్ 'ఎ' వ్యాక్సినేషన్ అవసరం

ప్రజాశక్తి - ఆరిలోవ : హెపటైటిస్ 'ఏ' కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న దృష్ట్యా వాటి నివారణకు సంబంధిత వ్యాక్సిన్ చేయించుకోవడం చాలా అవసరమని ప్రముఖ పిడియాట్రిక్, వాక్సినిస్ట్ డాక్టర్ సిహెచ్. ఫణికృష్ణ తెలిపారు. ఇటీవల ఒక ఆసుపత్రి నుంచి సేకరించిన డేటా ప్రకారం ప్రతి రోజూ 10 నుంచి 15 మంది రోగులు హెపటైటిస్'ఏ'తో వస్తున్నట్లు స్పష్టమైందన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన అవగాహన కల్పించాలని తెలిపారు. హెపటైటిస్ ఎ అత్యంత ప్రమాదకరమైన కాలేయ సంక్రమణ వ్యాధి అని, ప్రధానంగా కలుషితమైన ఆహారం, నీటి వినియోగం ద్వారా వ్యాపిస్తుందన్నారు. ప్రత్యేకంగా హాస్టల్లో నివాసం ఉండేవారు, తరచూ బయట భోజనాలు చేసేవారు ఈ వైరస్ బారిన పడే అవకాశం ఉందన్నారు. సాధారణంగా హెపటైటిస్ ఎ 14 నుంచి 28 రోజుల తరువాత బయట పడుతుందన్నారు. కామెర్లు, జ్వరం, అనారోగ్యం, ఆకలి లేకపోవటం, అతిసారం, వికారం, వాంతులు, కడుపులో అసౌకర్యం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.


డాక్టర్ ఫణికృష్ణ

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 31న కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ శనివారం ప్రకటనలో తెలిపారు. సిసిపి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో తక్షణ ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఎస్ఎస్‌సి మార్కుల జాబితా, పాలిసెట్, 2024 హాల్ టిక్కెట్, టిసి, కుల ధృవీకరణ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ ఒరిజినల్, మూడు జతల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌ఫోటోలు, రూ5,800 ఫీజుతో ఈ నెల 31న ఉదయం 9.30 గంటలకు కళాశాలకు హాజరు కావాలని తెలిపారు

సర్పంచ్‌ల భవిష్యత్ కార్యాచరణపై చర్చ

ప్రజాశక్తి- పద్మనాభం : సర్పంచ్‌ల భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్రకమిటీ సమావేశంలో చర్చించినట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్రకార్యదర్శి, మండలంలోని అనంతవరం సర్పంచ్ జి.లక్ష్మి తెలిపారు. శనివారం విజయవాడలో బాలోత్సవ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు.అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగిందన్నారు. ఎన్నికల తర్వాత జరిగిన మొదటి రాష్ట్ర కమిటీ సమావేశం కావడంతో పంచాయతీల విధులు, నిధులు, ఇతర అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారుసమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

రాజ్యాంగ హక్కుల రక్షణకు పోరాటం

ప్రజాశక్తి- ఉక్కునగరం: భారత రాజ్యాంగంతోపాటు వ్యక్తిగత హక్కుల పరిరక్షణకు పోరాటానికి సిద్ధం కావాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. ఉక్కునగరం కార్యాలయంలో వి.ప్రకాశ్ వరకుమార్ అధ్యక్షతన కెవిపిఎస్ స్టీల్‌డివిజన్ 7వ మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బన్న మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ సమస్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అధికారం కేవలం కొందరు చేతిలో కాకుండా, బడుగు బలహీన వర్గాల చేతికి అందినప్పుడే, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తి సాకారమౌతుందన్నారు. సంఘం ఒబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులందరూ ఏకమై భారత రాజ్యాంగానికి స్ఫూర్తిని పరిరక్షించాలని కోరారు. స్టీల్ సిఐటియు మాజీ ప్రధానకార్యదర్శి ఎం.కృష్ణారావు మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమౌతుందన్నారు.కార్యక్రమంలో టి.చిరంజీవి, కె.వెంకటరావు, వైటి.దాస్, త్రీన్ మూర్తిబాబు, యు.సత్యనారాయణ, బాలశౌరి పాల్గొన్నారు

రైతులకు పండ్ల మొక్కల పంపిణీ


మొక్కలను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద అర్హులైన గిరిజన రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఏపిఓ నాయుడు సమక్షంలో స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి, సర్పంచ్ సోమ్మెల రూతు చేతుల మీదుగా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి, సర్పంచ్ మాట్లాడుతూ, 2024-25 సంవత్సరమునకు మండలంలోని ఉన్న 24 పంచాయతి పరిధి రైతులను గుర్తించి పండ్ల మొక్కలను పంపిణీ చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతులకు కూలీ సొమ్ము చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఓ. నగేష్, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, టిడిపి నాయకులు జోగులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు గొడుగులు


గొడుగులు ఇస్తున్న కృష్ణకుమారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని పాత్రికేయులకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర రూరల్ జిల్లా అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి శనివారం గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఒడిసిపట్టి పాలకులకు, అధికారులకు కనువిప్పు కలిగించి పరిష్కార మార్గానికి పాత్రికేయులు పాటుపడుతున్నారని ఆమె కొనియాడారు. అటువంటి సేవా పరులకు తన వంతు చిన్నపాటి సాయాన్ని అందించడం ఎంతో ఆనందదాయకమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా మానవ హక్కుల నేర నిరోధక సంఘం అధ్యక్షుడు పి.బి. శ్రీనివాస్. స్థానిక పాత్రికే యులు, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వెలవెల


వెలవెలబోతున్న సంత

ప్రజాశక్తి-హుకుంపేట: వర్షాలకు కారణంగా స్థానిక వారపు సంత శనివారం బోసి పోయింది. కురుస్తున్న వర్షాలు కారణంగా బట్టల షాపుల దుకాణదారులు రాకపోవడంతో శనివారం ఖాళీ దుకాణాలు దర్శనమిచ్చాయి. వర్షాలు సీజన్ కావడంతో తార్పాలిన్లు, రైన్ కోట్లు, గొడుగుల విక్రయాలు జరిగాయి.


బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

ఐటిడిఏ పిఒగా సింహాచలం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఐటీడీఏ నూతన ప్రాజెక్ట్ అధికారిగా కట్టా సింహాచలం శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన సీతపల్లి గడి బాపనమ్మ ఆలయం, ఐ.పోలవరం సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. పిఒగా బాధ్యతలు స్వీకరించిన సింహాచలంను ఐటీడీఏ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావును ఐటీడీఏ పరిపాలన అధికారి డిఎన్‌వి.రమణ, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సింహాచలం మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజన సమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా సిటిజన్ ఎంగేజ్ టీములు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి ఎప్పటికప్పుడు అందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. ఐ.పోలవరం సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థానం గుడి దగ్గర కళ్యాణ మండపం కొరకు స్థలం కావాలని పూజారులు కోరారని, అందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబూ సలాం, పిహెచ్ఓ చిట్టిబాబు, ఉపాధి హామీ పథకం ఏపీడి జి.శ్రీనివాసరావు, ఎస్ఓ టి.మార్తమ్మ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది నూతన ప్రాజెక్టు అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని చట్టి గ్రామం తుర్రమ్ వారి గుంపులో జెకెసి ట్రస్టు ఆధ్వర్యాన రూ.70వేలుతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ట్రస్టు చైర్మన్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు తుర్ర ముత్తయ్య, టిడిపి మండల అధ్యక్షులు ఈల్లా చిన్నారెడ్డి మాట్లాడుతూ అడిగిన వెంటనే కాదనకుండా తాగునీటి బోరు ఏర్పాటు చేసిన జమాల్‌ఖాన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తుర్రం చిన్న ముత్తయ్య, చంద్రయ్య, కన్నారావు, సీతయ్య, విజయ్ కుమార్, ట్రస్టు ఎస్కే నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా కూలిన చెట్టు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ పరిధి చౌడుపల్లి గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చౌడుపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు బయలుదేరిన రాజేంద్రపాలెం పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ మనోజ్ఞ, వైద్య సిబ్బంది వాహనం కూడా అక్కడ నిలిచిపోయింది. స్థానికుల సహకారంతో చెట్టును తొలగించారు.

ఘనంగా వైభవ్ 'విశేష' జ్యూయలరీ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నానికి చెందిన ప్రముఖ బంగారు ఆభరణాల సంస్థ వైభవ్ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన విశేష జ్యూయలరీ ఎగ్జిబిషన్ శనివారం బీచ్ రోడ్‌లోని వెల్కమ్ హోటల్ డీవీ గ్రాండ్‌బేలో ఘనంగా ప్రారంభమైంది. 'విశేష' ప్రీవ్యూ అండ్ సేల్ జ్యూయలరీ ప్రదర్శన, అమ్మకం పేరిట ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను గంటా శారద, ఆశ, డాక్టర్ సరోజిని, సురేఖ, సావిత్రిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇన్స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్, క్యూరేటెడ్ గోల్డ్, డైమండ్, ఎంటిక్, ఫ్యూజన్, ఫైన్ జ్యూయలరీ డిజైనులతో పాటు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త కలెక్షన్ మహేయ (కోరల్) పగడాలతో పొదిగిన డిజైనర్ డైమండ్ జ్యూయలరీని ఇక్కడ అందుబాటులో ఉంచారు. ప్రత్యేక కలెక్షన్స్ లక్ష రూపాయల నుంచే ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

డొంకరాయి నుంచి 10,936 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయంలోకి భారీ వర్షాలకు అధిక శాతం వరద నీరు చేరుతుండడంతో శనివారం ఆ జలాశయం నుంచి 10,936 క్యూసెక్కులు నీటిని కిందకు విడుదల చేసినట్లు ఏపీ జెన్కో ఈఈ పి.విజయ్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకర్లతో శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 24 న డొంకరాయి జలాశయంలో 1035.50 అడుగులకు నీటి మట్టం చేరడంతో జెన్కో అధికారులు ఆదేశాల మేరకు ముందుగా రెండు గేట్ల ద్వారా దిగు ప్రాంతానికి 2,173 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పారు. భారీ వర్షాలు కారణంగా రిజర్వాయర్ పరిమితి స్థాయి పెరుగుతుండడంతో రిజర్వాయర్ భద్రత నేపథ్యంలో శుక్రవారం రాత్రి రెండు గంటల సమయానికి ఆరో నెంబర్ గేటు రెండు అడుగులు ఎత్తి మరో 2173 క్యూసెక్కులు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం డొంకరాయి జలాశయంలో వరదనీటి తాకిడి పెరుగుతుండడంతో ఆరు, ఏడు గేట్లు మూడు అడుగులు పైకెత్తి 2,229 క్యూసెక్కులు నీటి విడుదల చేశామన్నారు. మొత్తం నాలుగు గేట్ల ద్వారా 10,936 క్యూసెక్కుల నీటిని దిగు ప్రాంతాన్ని విడుదల చేస్తున్నామని తెలిపారు.

ఏపీపీ డ్యాం ద్వారా 2000 క్యూసెక్కులు దిగు ప్రాంతానికి విడుదల చేయగా, పవర్ కెనాల్ ద్వారా 3000 క్యూసెక్కులు విడుదలవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 13,500 క్యూసెక్కులు వరద నీరు ఇన్‌ఫ్లో ఉందని చెప్పారు. జలాశయంలో నీటి మట్టం 1035.80 స్థిరంగా కొనసాగుతున్నట్లు ఇఇ విజయ్ కుమార్ తెలిపారు.

ముమ్మరంగా వరి నాట్లు

ప్రజాశక్తి కొయ్యూరు

అధిక వర్షాలు కురవడంతో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలోని కొయ్యూరు, రాజేంద్రపాలెం, శరభన్నపాలెం, తీగల మెట్ట తదితర గ్రామాల్లో రైతులు నాట్లు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల వరి ఎదగకపోవడంతో దమ్ములు చేసి ఉంచుతున్నారు. గతంలో వ్యవసాయ పనులకు కూలీల సమస్య ఉండేది కాదని, కాని నేడు కూలీల సమస్య అధికంగా ఉందని రెప్పారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక నష్టాలు ఊపులో కూరుకు పోతున్న రైతాంగం పంట పొలాల్లో ఎద జల్లడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఎద జల్లడం వల్ల ఎకరానికి రూ.6000 నుండి రూ.8000 వరకు రైతులకు ఆదా అవుతుందని చెబుతున్నారు.


వరి నాట్లు వేస్తున్న మహిళలు

చిన్నారుల కిడ్నాప్ కేసు ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెందుర్తి ప్రాంతంలో చిన్నారుల కిడ్నాప్ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. వివరాల్లోకి వెళితే ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా కాళికట్ ప్రాంతానికి చెందిన మినతి ప్రధాన్ పిల్లలతో సహా పెందుర్తి నియోజకవర్గంలోని నరవలో కూలి పనులు చేసుకుంటూ నివాసం ఉంటోంది. అదే రాష్ట్రానికి చెందిన ముద్దాయి వాసు దేవ జెల్లీ కూడా నరవలో ఉంటూ కూలీపనులు చేసుకుంటున్నాడు. మినతి ప్రధాన్‌కు సోదరి ఉంది. కొద్దిపాటి పరిచయంతో నిందితుడు ఆమె సోదరిని తనకు ఇచ్చి వివాహం చేయాలని కోరాడు అందుకు ఆమె నిరాకరించడంతో ఈ నెల 18న మినతి ప్రధాన్ పిల్లలు ఇద్దరినీ కిడ్నాప్ చేసి తరలించుకుపోయాడు. తల్లి అదే రోజు సాయంత్రం కూలి పని అనంతరం ఇంటికి వచ్చి చూసే సరికి ఇద్దరు పిల్లలు కనపడలేదు. దీంతో ఒడిశాలో ఫిర్యాదు చేసింది. వెంటనే అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్.నమోదు చేసి పెందుర్తి పోలీసులకు కేసును బదలాయించారు ఇక్కడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 22న ఎస్ఐ సింహాచలం పోలీసు బృందాలను ఒడిశాకు పంపారు. నిందితుడు ఒక్క ఫోన్ కాల్ ఆధారంగా దొరికేశాడు. అతన్ని అదుపులోకి తీసుకొని పెందుర్తికి తరలించారు పిల్లలను తల్లికి అప్పజెప్పారు కేసును ఛేదించిన వారిని ఎసిపి అభినందించారు.

స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ

కూటమి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆగస్టు 7న జరిగే జివిఎంసి స్టాండింగ్ కౌన్సిల్‌లోని మొత్తం పది స్థానాల నుంచి టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులను పోటీకి నిలపాలని శనివారం దసపల్లా హోటల్‌లో జరిగిన కూటమి ఎమ్మెల్యేల, కార్పొరేటర్ల సమావేశం నిర్ణయించింది. జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబు, పి.గణబాబు, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల కోసం సోమవారం నామినేషన్లను దాఖలు చేయవలసి ఉంటుందని, ఈలోగా కూటమిలోని శాసనసభ్యులు వారి పరిధిలోని కూటమి కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి, వారందరి అభిప్రాయంతో ఒక్కొక్క ఎమ్మెల్యే ఒక్కొక్క అభ్యర్థిని స్టాండింగ్ కౌన్సిల్‌కు ఎంపిక చేయాలని నిర్ణయించారు. అలా నిర్ణయించబడిన అభ్యర్థికి కార్పొరేటర్లు అందరూ సహకరించి, ఆ కార్పొరేటర్ గెలుపునకు కృషి చేయాలని, స్టాండింగ్ కౌన్సిల్‌కు పోటీ చేసే అవకాశం దక్కలేదని ఏ ఒక్కరూ అసంతృప్తి వ్యక్తపరచకూడదని అన్నారు. రాష్ట్రంలో కూటమికి 63 శాతం ప్రజలు మద్దతు తెలిపారని, జివిఎంసి పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలలో కూటమి అభ్యర్థులు భారీ ఆధిక్యతతో విజయాలను అందుకున్నారని, ప్రజాభిప్రాయం కూటమికి అనుకూలంగా ఉందని తెలిపారు. జివిఎంసిలో స్టాండింగ్ కౌన్సిల్‌తో పాటు మేయర్ పీఠం కూడా దక్కించుకునేలా అందరూ పనిచేయాలని నిర్ణయించారు.


అడ్డతీగలలో మొక్కలు నాటుతున్న అధికారులు

పఠన నైపుణ్యం పెంపుదలపై శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో పఠన నైపుణ్యం ఎలా పెంపుదల చేయాలో అన్న అంశంపై మండలంలోని పెద్ద గెద్దాడ మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం శిక్షణ నిర్వహించారు. దీనిని జిల్లా విద్యాశాఖ పరిశీలకులు రమేష్, పాడేరు ఎంఇఓ కె.భాస్కరరావు, రంపచోడవరం ఎంఈఓ 2 రామకృష్ణ సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ సిలబస్ యొక్క విధి విధానాలను, పిల్లలలో పఠన నైపుణ్యాన్ని ఎలా పెంచాలి అనేదానిపై వివరించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా తల్లిదండ్రులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మొక్కలు నాటివేత

అడ్డతీగల : శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గురుకుల బాలుర పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించడం, విద్యార్థులతో మాటామంతీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని చెప్పారు. వర్షాలు పడుతున్న కారణంగా విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కెబి.హరినాధరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-సీలేరు : 15 రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి వ్యాధులు ప్రబల కుండా ముందుస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలు మేరకు పంచాయతీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జికె.వీధి మండలం సీలేరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వెల్లడించారు. సీలేరు సచివాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీటీసీ, సర్పంచి, ఉపసర్పంచి, వార్డు సభ్యులు సమక్షంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రపరచుకొని పంచాయతీ పాలకవర్గానికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. అనంతరం స్థానిక వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి సమక్షంలో శానిటేషన్‌లో భాగంగా లార్వా తయారై దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ ప్రిపేర్ చేసి నిల్వ ఉన్న వర్షపు నీటిలో ప్రయోగాత్మకంగా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్గో, ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్, వార్డులు సభ్యులు రాము తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, అందువల్ల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలని సూచించారు. పిహెచ్‌సిల్లో మందులు కొరత లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రహదారులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మండలంలోని ఎన్ని అంగన్వాడీ కేంద్రాలకు గతంలో నిర్మించిన భవనాల పరిస్థితులు ఎలా ఉందో, వాటిని ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదో సమీక్ష చేశారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా తంటికొండ గ్రామం ముంపునకు గురవుతున్న నేపథ్యంలో సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సర్పంచులు ఎంపీటీసీలు, సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ ఎస్ వెంకయ్య పాల్గొన్నారు.